



# నిర్దోషి

ఇంట్లో అడుగువేసి అలాగే నిలిచి పోయాడు. నిజంగానే అదృశ్యం ఆశ్చర్యంగావుంది. తన జీవితంలో ఇటువంటివి మామూలేఐనా, ఈ పరిస్థితుల్లో స్నేహితుణ్ణి చూస్తానని చూడవల్సి వుంటుందని వూహించనైనాలేదు. ఆశ్చర్యంగా చూస్తునే మూడు అడుగులు ముందుకొచ్చి "ఆ నువ్వా?" ఆశ్చర్యంగానే అడిగాడు ఆనంద్.

"అవును...నే...నే" చేతిగుడ్డతో ముఖం కప్పుకొని బావురుమన్నాడు గోవిందు.

వచ్చినపని మరచిపోయి నిశ్చేష్టుడై నిలచిపోయాడు ఆనంద్. పది నిమిషాలు గడచిపోయాయి.

"సరే! పైకిలే పోదాం...మిష్టర్... కానిస్టేబుల్...వూ...నీపని కానీ"

"నువ్వా నమ్ముతున్నావా? నిజంగా దైవం సాక్షిగా నేనాపని చేయలేదు ఆనంద్...నమ్ము...నామాట నమ్ము ప్రమాణంగా" నిల్చున్న ఆనంద్ కాళ్లు పట్టుకొని మరోసారి బావురుమన్నాడు.

నిస్సహాయంగా స్నేహితుని ముఖంలోనికి చూచి మౌనంగా నిలిచి అలాగే చూస్తుండిపోయాడు ఆనంద్.

"ఇంత మోసం చేస్తుందని కలలో కూడా వూహించలేదు. నమ్మించి నా గొంతు కోసింది...నా మాట నమ్ము ఆనంద్...నువ్వు కాపాడనూవద్దు, రక్షించనూవద్దు. నా మాట మాత్రం నమ్ము. నేనీనేరం చేయలేదని నువ్వు నమ్ము. అంతేచాలు. నా ఖర్మ నేను అనుభవించక తీరుతుందా...? కారుతున్న కన్నీటిని చేత్తో తుడుచుకుంటూ పైకి లేచాడు గోవిందు.

"ఎవరి తలవ్రాత వారిది...ఊ... కానీ చెప్పు" అంటూ కుర్చీ మీద కూర్చున్నాడు ఆనంద్.



తడిసిపోయిన చేతిగుడ్డతో మరొక్కమారు కన్ను లొత్తుకుంటూ క్రింద కూర్చున్నాడు గోవిందు.

"అది కాదురా...తెలియక అడుగుతున్నా. ఇంతకూ నీవు నిర్దోషంటావా" ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు ఆనంద్.

తడి ఆరిన గోవిందు కళ్ళు మరలా అశ్రుపూరితాలయ్యాయి.

"అవును!...కానీ నువ్వు ఇలాంటి కేసులెన్ని చూశావో...? అందులో యిదీ ఒకటి. వాటిల్లాగే దీన్నీ నమ్మేశావ్. ఆనంద్! నీ ఉద్యోగ హోదాతోకాక మన చిన్ననాటి స్నేహరీత్యా ఆలోచించు. నిజంగా నేను నేరాలు చేసే వాణ్ణేనా?...మీలాంటి వారికి కనబడే నగ్నసత్యమేముంది. ఎంతచెప్పి ఏం లాభం?...నీ ధర్మం నీవునిర్వర్తించు. నిరాశమేఘం ఆవరించినవానిలాగే జవాబిచ్చాడు.

"నిజమే...నా ధర్మాన్ని నేను నిర్వర్తించక తప్పుతుందా మరి?...కానీ

అసలు విషయమేమిటి?...స్నేహితుడు అడుగుతున్నా సబ్ ఇన్‌స్పెక్టర్ హోదా మరచి...యింకైనా చెప్పు...నీవు నన్ను స్నేహితునిగా భావించుకొనేచెప్పు బహుశా నీ కండ్లకు నేను సబ్ యిన్‌స్పెక్టర్‌గానే కనబడుతుంట...ఎందు కంటావా...? నీవు నేరం...చే..."

"అమాటే అనొద్దు. నువ్వో నిజానిజాలు గ్రహించకనే దోషి క్రిందే జమ కట్టేస్తున్నావ్"

"నువ్వు నిర్దోషే కావచ్చు కానీ చట్టం దృష్టిలో నేరస్థుడైనవాడు నా దృష్టిలో కూడా నేరస్థుడే. అందుకే ఆ చట్టానికి నిన్ను బద్ధునిగా చేయటానికి నేనొచ్చాను. యిప్పుడు అదంతా మరచి పోయి, నిన్ను చిన్ననాటి నీ "బుజ్జాయి"గా మనసులో నుంచుకొని నిజానిజా లంటున్నావే ఆ నిజానిజాలు—నమ్మమంటున్నావే నమ్మడానికి నిదర్శనాలు ఏమిటో చెప్పు" అడిగాడు సబ్ యిన్‌స్పెక్టర్ ఆనంద్.

గోవిందు కన్నులోని నిరాశ సన్నగిల్లింది. ఆశారేఖలు చిగురించాయి వాటి స్థానే.

* * *

"కామేశ్వరీ నేనూ క్లాసు మేటులు కాకున్నా ఒక బడిలోనే చదివాం. నేను థర్డ్ ఫారం చదువుచుండగనే మా తండ్రి గతించాడు. అప్పటికే మా పొట్ట గడవడం కష్టమైనందున చదువు చాలించి సెటిల్‌మెంటు ఆఫీసులో జవానుగా కుదిరాను. కామేశ్వరిపై ఆనాటినుండి నాకొక మమకారం వుండేది. యుక్తవయస్సు వచ్చినందుకేమో ఆమె కూడా చదువు చాలించింది. వారి యింటిముంగిటే మా ఆఫీసువెళ్ళేదారి. ప్రతిరోజూ నే నామెను చూస్తుండేవాడిని.

"ఆ సొదంతా చాలించి అసలు విషయం కానీ...బైమవుతుంది" విసుక్కున్నాడు ఇన్‌స్పెక్టర్.

"అంతా ఔట్ లైన్‌గా చెప్తాను. లేకుంటే అసలు అర్థంకాదు" గొణిగాడు గోవిందు.

"సరే...చెప్పు"

"నే నాఫీసుకి బయలుదేరి వెళ్ళుతుండే సమయానికి నీళ్ళు తెస్తూ నాకు అగుపించేది. హంసలాగ నడచివస్తున్న ఆమెకేసి తన్మయత్వంతో రెప్పలార్పక చూచేవాడిని. తలవంచుకొని దగ్గరగా వచ్చి టక్‌మని తలపైకెత్తి చిలిపిగా ముఖంలోనికిచూచి వెళ్ళిపోయేది. ఆ చూపులోని ఏదో ప్రత్యేకత నన్ను గిలిగింతలు పెడుతుండేది. ఆ చూపులూ, ఆ నడకా, ఆ వయ్యారము నన్నాకర్షించాయి. ఆ మోహినీరూపం నా మనః ఫలకముపై చెదరని రాతిబొమ్మలోని శిల్పంలాగా నిలిచిపోయింది. నామనసామెను కోరింది.

రచన: ఎస్. చిన్నప్ప

"నీ ప్రేమభిక్షకై నిరీక్షిస్తున్నా"నని ఓరోజు ఒక ప్రేమలేఖను వ్రాసిపంపాను...నా ఆశయం నెరవేరింది అంటే ఆమెనుండి బదులులేఖ వచ్చింది. కానీ నాకది నిరాశలేఖ.

"తిండికి కూడా గతిలేక బంట్రోతుగావున్న నీకు మన్నూ మిన్నూ ఏకమైనట్లుందా? నీ వెంత? నేనెంత? గాజుముక్కను కోరవలసినవాడు కోహినూరు వజ్రాన్ని కోరుతున్నావ్ జాగ్రత్త" అని.

ఆనాటినుండి నాఅభిమానం దెబ్బతిన్నా నాలోని ఆశారేఖలు మోడువారక అలాగే నిలచిపోయాయి.

ఆమెకు మంచిరోజు లొచ్చినట్లున్నాయ్. పేలవమైన పేషన్‌నగలుపోయి మిలమిల మెరసే బంగారునగలామె అందాన్ని రెట్టించాయి. హంస ఎగిరిపోతుంటే ఆ రెక్కల సౌరభానికితగ్గ ఒక మనోహరధ్వనిలా ఆమె కట్టుకున్న సిల్కుచీర రెపరెపలాడుతుంటే నాట్యం చేసినట్లుండేది. నేను ఎక్కడున్నా నా వూహలు మాత్రం ఆమెను క్రీనీడలా వెన్నంటి పోయేవి. నాకు తెలియకనే నామనసామెను కోరుతుంది. చూడ కూడదనుకున్నా నా మాట లెక్కచేయకుండా నాకన్ను లామెను వెతుకుతాయి. ఆమెకు ఇంత సిరి ఎలా కల్గిందో అనుకొనేవాణ్ణి.

ముందటిలాగా నీళ్ళకు రా దిప్పుడు. ఆఫీసుకెళ్ళేటప్పుడు మాత్రం తప్పక కన్పిస్తూంది. ముగ్గుపెడుతూనో, ముఖం కడుక్కుంటూనో...ఆమె జీవితంలో యిన్ని మార్పు లొచ్చినా, నా బంట్రోతు జీవితంలో ఏమార్పూ రాలేదు. ఆమెపైనున్న కోరిక రెట్టింపు కావడం తప్పించి.

* * *

ఆరోజు ఆఫీసు ఇన్‌స్పెక్షన్‌వుంది. మామూలు సమయానికన్నా ముందుగనే, తెలతెలవారుతుండగా ఐదు గంటల్లోనే ఆఫీసుకి బయలుదేరాను. సూర్యునిరాకకు యింకా ఒకటి, ఒకటిన్నర గంటలున్నందున బహుళపక్షచంద్రుడు మసకగా ప్రకాశిస్తూనే వున్నాడు. తన ప్రభావమంతా నామీద ప్రయోగిస్తున్న చలిదేవునికి భయపడి తప్పు చేసినవానిలా చేతులు కట్టుకొని చలికి గడగడలాడుతూ వస్తున్నా. ముందు నావైపు ఎవరో వస్తున్నట్లు తెల్లటి ఆకారం కనబడింది. ఎవరైతే నాకేం? అన్నట్లు చూడకుండా తలవంచుకొని పోతున్నాను. ఆ ఆకారం నాముందు నిలబడేదాకా గుర్తించలేకపోయాను. నిదానించి పరీక్షగా చూశాను ఇంకెవరు? ఆమే.

"ఏమండీ! ఈ రోజింత త్వరగా బయలుదేరారేం? నవ్వుతూ అడిగింది.

ఆశ్చర్యపోయాను. ఆమె ప్రవర్తనకు.

"పనుంది" క్లుప్తంగా జవాబిచ్చి తప్పుకోబోయాను.

"ఆగండి...? ఒక్కమాట..." నా ఎడమచేయిని ఆమె కుడిచేత్తో గట్టిగా పట్టుకుంది.

ఆగిపోయాను. మల్లెపూవులాంటి కరస్పర్శ నా దేహంలో విద్యుత్ప్రవాహన్ని రేకెత్తించింది. ఆమెను రాణిగా భావించుకొంది నా మనస్సు. "వారు" తలచుకుంటే కానిదేముంది ?

"గతాన్ని మరచిపోండి. మనస్ఫూర్తిగా మిమ్మల్ని ప్రేమిస్తున్నా అర్ధరాత్రికిక్కడవస్తే మీతో ఏకాంతంగా కొంత సేపు..." నా సంతోషానికి హద్దులేదు. జీవితాని కింకేం కావాలి? ఒక అందమైన యువతి ఏకాంతాన్ని కోరితే ఏ యువకుడు కాదంటాడు...? నా జీవితాని కిది మొదటిపండుగనుకున్నా... నా జీవితానికేకాదు, ప్రతి యువకుని జీవితానికీ ఈలాంటి సందర్భమే జన్మానికొక శివరాత్రి అనుకున్నాను.

"ఏం...వస్తారుకదూ!" మళ్ళీ అడిగింది.

"తప్పకుండా...అనేసాను ముందు వెనుక ఆలోచించకుండా. ఈ నా అవివేకమే యింతటికీ మూలం..." మరలా గోవిందు ముఖంలో విషాదరేఖలు క్రమ్ముకున్నాయి.

"టైమైందిసార్" హెచ్చరించాడు. ప్రక్కనున్న కాన్‌స్టేబుల్.

కుర్చీపైనుండి పైకి లేవబోయాడు ఆనంద్.

"దయవుంచి ఈ కాస్త కూడా వినండి ఇన్‌స్పెక్టర్‌గారూ" అంటూ చేతులు పట్టుకుని బ్రతిమలాడుతూ ప్రారంభించాడు.

"గాజుముక్కను కోరవలసినవాడు కోహినూరు వజ్రాన్ని కోరుతున్నావ్... జాగ్రత్త..." ఈ మాటలు చెవుల్లో గింగురుమంటున్నా లెక్కచేయకుండా, రాత్రి పన్నెండుగంటలవేళలో కామేశ్వరి ఇంటి కడపలో అడుగుపెట్టాను. నాకోసం వేచియున్నఆమె నన్ను చిరునవ్వుతో లోపలకు ఆహ్వానించింది. సందేహం లేకుండా లోపల కెళ్ళాను. పూవులాంటి ఆమె అధరాన్ని నాకందించింది...ఆమెను బలంగా నావైపు లాక్కోబోయాను...ఇంతలో ఎవరో వస్తున్నట్టు అడుగుల శబ్దం వినబడింది. ఆత్రంగా ప్రక్కనున్నగదిలోనికి తోసి, ఓరగా తలుపుమూసి వచ్చే ఆ వ్యక్తి ఎవరో చూట్టానికై నిరీక్షించింది కామేశ్వరి.

* * *

"మరలా ఎందుకొచ్చావ్?" క్రోధం మిళితమైన కామేశ్వరి కంఠం.

"పనుంది...కాబట్టి" ఒక పురుష కంఠం.

"ఏమిటాపని...?" కోపపూరితమైన కామేశ్వరి ప్రశ్న.

"నేచ్చిన ఆ నగలు"

"నగలూలేవు నట్రలూలేవు....నడూ బయట"

"నువ్వు అలాఅంటావని నాకూ తెల్సు...కానీ అంత సులభంగా వెళ్లిపోతాననుకోకు. న్యాయంగా నా సొత్తులను నా..."

"సొత్తులు...ఎక్కడవా సొత్తులు? ఎక్కడున్నాయని...? ఎవరిచ్చారని... సొమ్ములూ గిమ్ములూ ఏమీ లేవు. ముందు పదా బయటకు...పూ..."

"కామేశ్వరీ! అన్యాయంగా, అనవసరంగా అవమానాలపాలుకాకు. నా మాట విను. నీవు వూహించలేనటువంటి అగాధంలో వూబిలో చిక్కుకొనిపోతావ్. నీ గాలి మేడలన్నీ నాకు తెల్సు. కానీ అది నీ యిష్టం. ఎంత ఎతుయినా నిర్మించుకో, పర్వాలేదు. కానీ నా సొమ్ములు నాకు ముట్టజెప్పకుంటే ఆ గాలిమేడలన్నీ పేక మేడల్లాగా చెల్లాచెదరౌతాయి. నామాట వి..."

"ఛీ! దుర్మార్గుడా...చాలు నీ హితవాక్యాలు. అవన్నీ నీ కనవసరం. ఆ నగలు చచ్చినాసరే ఇవ్వను. ఇవ్వలేను. మూర్ఖుడా...పాపి...ద్రోహి... ఛండాలుడా..."

కామేశ్వరీ!" ఆ పిలుపుకు ప్రతిధ్వనించిందా యిల్లు.

కామేశ్వరీ మళ్ళాచెబుతున్నా విను. న్యాయంగా నా నగలు నాకిచ్చెయ్..." ఎంతో పట్టువలవుంది ఆ కంఠధ్వనిలో.

"ఛీ! నీకూ న్యాయాన్యాయాలున్నాయా? అసలు ఆమాట లనడానికే నీ కర్హతలేదు. నమ్మించి నాగొంతు కోశావ్ మూర్ఖుడా నిన్నునమ్మి నా గొంతుకు నేనే వురిత్రాడు బిగించుకున్నంత పనైంది. నగలంటున్నావే-? ఆ నగలను మరలా యిచ్చేయాలనే యిచ్చావా నాకు? "కామేశ్వరీ! ప్రియురాలా! నీవు కనికరించకుంటే నా గుండె ఆగిపోతుంది...నా హృదయం పగిలిపోతుంది. నీవాణ్ణి. కనికరించు" అని కాళ్ళు వేళ్ళూపడి బ్రతిమాలావే "నిన్నుతప్పక పెళ్ళాడుతా"నని ప్రమాణం కూడా చేశావే-? ఆ ప్రతిజ్ఞలంతా ఏమైనాయి? యింకా నగలట, నగలు. తిరిగీ యిచ్చివేయాలట...ఆమాట మరచిపో యింక ఈ జన్మలో వాటిపేరెత్తకు" ఏడుస్తూనే దుయ్యబట్టింది.

"యింకా ఏమైనా మిగిలిపోయాయేమో జ్ఞప్తికి తెచ్చుకో...పతివ్రత పలుక వలసిన యింకా కొన్ని మాటలను మరచిపోయినట్లుంది..." హేళనగా నవ్వాడు.

"కామేశ్వరీ! మరలా చెబుతున్నా విను. నీకలలన్నిటినీ కల్లలుగాచేస్తాను. నేను మగవాడు నాకేం? ఎన్ని తప్పులైనా బాపుకోగలను. సంఘం నన్ను యధావిధిగా గౌరవిస్తుంది. మరినువ్వు? ఆడదానివి. ఒక్కసారి తప్పుత్రోవ తొక్కావంటే...మరి నీవు సంఘ గౌరవానికై ఎన్ని పునర్జన్మలెత్తినా సంఘం నిన్ను

గౌరవించదు. బాగా యోచించు...నీ తప్పు లోకానికి బహిర్గతమైందంటే సంఘం వేలెత్తి చూపుతుంది ... అసహ్యించుకుంటుంది. దానికన్నా మరణం మేలు. నీవు నీ తప్పును కప్పిపుచ్చుకోకుండా, గర్భంతోవున్నట్లు లోకానికి సాటి చెబుతాను. కాకినాడలోవున్న మీ అన్నయ్యకి ఆకాశరామన్న ఉత్తరంవ్రాస్తాను. నీ గౌరవాగౌరవాలు, నీ భావిజీవితం అంతా నాహస్తగతం. అందుకే నే చెప్పినట్లు విను. నా నగలు నా కిచ్చేయ్... నా దారిని నే బోతాను తర్వాత అంతా నీ యిష్టం..."

"దానికన్నా మరణంమేలు...దానికన్నా దానికన్నా మరణం" ఈ మాటే కామేశ్వరిబుఱ్ఱలో మార్మోగింది. పళ్ళు పటపటమన్నాయి.

"అంతేనా...?" ఆడపులి గర్జించినట్లుందా శబ్దం.

"అంతే" నన్నట్లు తలూపి, చేయి ముందుకు సాపాడు.

అతనిపైకి తాళపు చెవులు ఎగురవేసింది కామేశ్వరి.

విజయగర్వంతో తాళపుచెవులనందుకొని లోపలి కెళ్లిపోయాడు ఆ వ్యక్తి.

తలుపు సందులోనుండి కామేశ్వరి ముఖం ప్రస్ఫుటంగా కనబడుతూంది. నాకు ఆ కోపాన్ని, ఆమె ఆవేశాన్ని చెప్ప తరంకాదు. అసురమర్దన చేయబోవు కాళివలె పగబట్టిన నాగుబాము నాలుకను జొనుపుతూ కాటువేయుటకు సిద్ధముగా వున్నట్లుం దామె ముఖగాంభీర్య వర్చస్సు.

కొంతసేపు అలాగే ముందు వెనుకలాలోచించింద. ఉన్నట్లుండి ఆమె ముఖంలో ఆశాకిరణంవెలసింది. త్వరగా ఆ వ్యక్తి వెళ్లినవైపు కోపంగా వెళ్ళిపోయింది.

నాఆలోచనకు అంతులేదు ముందు నా ప్రేమని ఆమె ఎందుకు నిరాకరించిందో, మరలా ఎందుకు ప్రేమించిందో నా ఆలోచనల్లోనుండి తేరుకున్నాను.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఉన్నట్టుండి "అబ్బా...చచ్చా..." క్రిందబడిన శబ్దం వినబడింది. ముందు వెనుకలు చూడకుండా శబ్దం వినవచ్చిన వేపు ఆతురతతో పరుగెత్తాను. నేనున్న ప్రక్కగదిలోనుండి మూలుగు వినబడినది. ఆ గదిలోనికి రెండడుగులు వేసి నిశ్చేష్ఠుడై అలాగే నిల్చుండిపోయాను. ఆ నూతన వ్యక్తి వీపులో తళతళలాడే కత్తి ఒకటి మెరుస్తూంది. రక్తప్రవాహంలో గిలగిలకొట్టుకుంటూ పడివుంటే నాకేమి పాలుపోలేదు. "టకామని కత్తి లాగివేద్దామని ఆకత్తిపిడిపట్టుకున్నాను. దానిపైన వ్రేలిముద్రలు సాక్ష్యంగా దొరకి నన్ను హంతకునిగా నిర్ణయిస్తారని అప్పుడే జ్ఞాపకమొచ్చింది. అంతటితో ఆ ప్రయత్నం విరమించుకున్నాను...ఇంతలో హఠాత్తుగా గది తలుపులు మూసుకున్నాయి...అంతే... నాకు పిచ్చెక్కినట్లయింది.

పారిపోవడానికి ప్రయత్నిస్తూ గది తలుపులు తెరువబోయాను. కానీ నా శ్రమ నిష్ఫలమైంది.

తలుపు దగ్గరనుండి హత్యచేయబడిన వ్యక్తి సమీపానికి—అక్కడనుండి తలుపు దగ్గరకు పిచ్చివానిలా తిరిగాను. తిరిగి తిరిగి కూలబడిపోయినాను.

కొంతసేపు గడచింది. "ప్రక్కనున్న గదిలోనుండి అలారంలాంటి శబ్దమూ, మాటలూ వినబడినాయి. ఆ ధ్వనులను బట్టి ఫోను చేస్తున్నట్లు వూహించాను. కొంతసేపటికి మీ రొచ్చారు. అంతే అన్నాడు గోవిందు. కనుపాపలపై పొరలే కన్నీటిని ఆపుకోలేక బోయాడు.

"అంతా గడచిపోయింది. యిప్పుడు నన్ను దోషంటారా? చెప్పండీ ఇన్‌స్పెక్టర్‌గారూ! నేను నిర్దోషినికానా?" వెక్కివెక్కి ఏడ్చాడు.

ఇన్‌స్పెక్టర్ ఏమీ మాట్లాడలేదు.

"చెప్పండి నామాట నమ్మరూ? నిజంగా తేను నిర్దోషినే...నిర్దోషినే. ఏమంటారండీ పోనీ నమ్ముతారా..." నేను నిర్దోషిని కదూ" తన మాటలపై తనకే విశ్వాసము లేనట్లు హీనస్వరంతో అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ ఒకసారి నిట్టూర్పువదలి "అట్లా అని నేనంటే ఏమౌతుంది.? కోర్టువారనాలికదూ" అంటూ పైకిలేచి గోవిందు చేతులకు కరబంధాలు తగిలించాడు.

★


# సిప్పిలినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు: మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును. 20 పూటలమందు రూ. 3=50 న.పై.

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376, మద్రాసు-1.